ఆట

అవసరాల రామకృష్ణారావు

ఎలాగా ఆఫీసుకి శలవు పెట్టేను కదా అని ఆ రోజు కాస్త తీరికగా భోంచేసి మరోగంట ఎక్కువగా నిద్రపోయి గోపాలరత్నం కళ్ళు తెరిచి చూసేసరికి అలమార పై సొరుగులో అతని కెదురుగుండా కనిపించింది డే కేలండరు. మార్చబడుతున్న ఆ అట్టముక్కలకీ, గడుస్తున్న తన రోజులకీ అట్టే తేడా కనపడ లేదతనికి. తన ఒంటిమీది గుడ్డల్లా నలిగిపోయి ఉన్నాయి అవి. అయినా తనలాంటి వాళ్ళకి అందులో మొదట పది తేదీలూ కనుచూపు మేరలో గిర్రున తిరిగిపోతాయి. ఇక ఆఖరి పది ఒక్కొక్క తేదీ ఒక్కొక్క ఆజన్మాంత ఖైదీ.

కాదు. కాదు ఆ జూన్ పదహారు అన్ని తేదీలలాంటిది కానేకాదు. తను పాతిక రూపాయిలు అప్పుచేసి తోటి గుమాస్తాగాళ్ళ నలుగురి నోళ్ళూ తీపి

పుట్టిన రోజది. మళ్ళీ గిర్రున ఏడాది తిరిగే సరికల్లా దాని ఏడాది పుట్టినరోజు తన యింట్లో ఎలా చేసుకున్నారో తన కింకా గుర్తుంది.

చిట్టికి తెచ్చిన కొత్త గౌను చవక అవనీ, అదికట్టుకున్న చిట్టి నవ్వింది మరి! తను తెచ్చిన జిలేబీ నూనెతో చేసిందే అవనీ, అందరూ ఓ చోట కూచుని కబుర్లు చెప్పుకుంటూ తిన్నారు మరి! ఆ రోజు తన కుటుంబం బెంచీ టిక్కెట్టుకే సిని మాకి వెళ్ళనీ, అప్పటికే కళ్ళ మసకలు ప్రారంభమైన అమ్మమ్మ కూడా సినిమాకి వచ్చింది మరి!

అదే అదొక్కటే అప్పటికీ ఇప్పటికీ తాము జరుపుకున్న పుట్టినరోజు! మొదటి పంట కనుక ఆ మాత్రం వేడుక కయినా నోచు కుందేమో! నిజమేమరి

మొదటి సంతానం మొట్ట మొదట ఏడుపయినా ఎలకోయిల స్వరమాలిక.

రెండోది పక్కింట్లో సంగీత సాధనం.

మూడోది బొక్కి పాప నోటి కొబ్బ రాకు బూరా.

నాలుగోది నూనె చాలకపోయినా నడ వక తప్పని సంసార చక్రాల బ్రతుకు పాట.

అయిదోది అప్పుడే మెయిలు ఆగిన రైల్వేస్టేషను.

ఆరో శబ్దం వినపడకుండా గోపాల పట్నమయితే జాగ్రత్తపడలేదు గాని ఆ పురిట్లో వాళ్ళావిడే జాగ్రత్తపడింది. ఆప రేషను చేయించుకుందని కాదు. ఇక జన్మలో మరచిపోలేని శస్త్రచికిత్స తనకే చేసింది.

"ఎప్పటికప్పుడు ఎంత శతపోరినా మీరు ఆపరేషను చేయించుకున్నారు కారు. నాకూ చేయించారు కారు. చాలీచాలని సంపాదనగల సంసారంలో పిల్లలకి జవాబు చెప్పుకోలేక తల్లిప్రాణం యెలా తల్లడిల్లిపోతుందో తండ్రిప్రాణానికికూడా కాస్త రుచి చూపించడానికి ఆడది మొగా డికి ఇంతకంటె పెద్దశిక్ష వెయ్యలేదు" అనుకుందేమో! తన నోటితోమాత్రం అనలేదు.

ఆరో పిల్ల పుట్టడమయితే పుట్టింది గాని ఏడవడం యిష్టంలేక కాటోలు బతకలేదు. అంత సుఖమైన మార్గం చూపించిన చంటిదాన్ని వదిలిపెట్టడం యిష్టంలేక కాటోలు, తల్లికూడా అదే దారి తీసింది.

"ఇలాంటివి ఇంకా ఇంకా చూడ్డానికే కాటోలు, అందరి ఆయుష్షు పోశాడు భగవంతుడు నాకు" అని అమ్మమ్మ గొల్లుమంది. అపిడ మాట కాదనడానికి వీల్లేక కాటోలు ఎనిమిదేళ్లు బతికి—సరిగ్గా జూన్ పదహారునే—చిట్టి నాలుగునెలల క్రిందట అమ్మా చంటిదీ ఎక్కడికి వెళ్ళేరో నాలుగుదిక్కులా చూడడానికి కాటోలు జయంఇచేరి వెళ్లిపోయింది.

యువ



చిట్టి పోయినప్పుడుకూడా తను పాతిక రూపాయిలు ఖర్చుచేసి ఇరుగుపొరుగుల నోరు మూయించవలసి వచ్చింది.

ఆ తారీఖు చూస్తూంటే ఏడుపో నవ్వో తెలియనిదొకటి వచ్చింది గోపాలరత్నం కంటి చివరికి వేడినీటిచుక్క రూపంలో.

దిక్కుమాలినవాళ్ళ బతుకుల్లో పుట్టిన రోజుకీ, చచ్చినరోజుకీ పెద్ద ఏమంత తేడా ఉంటుంది గనక! అమ్మమ్మ అనేక రకాలు చూసినది, కడుపులో కాళ్లుపెట్టుకు పడుకోగలదు. ఇరవైఏడేళ్ళ పెళ్ళికాని తన చెల్లెలు ఇంగితం ఎరిగినది, కన్నీరు పైకి చిమ్మకుండా కాలక్షేపం చెయ్య గలదు. ముప్పైఏళ్లు రాకుండానే మోస్తున్న భారంతో జవజీవాలు చచ్చినది. తన మనసు ఏది ఏమైనా లెక్కచెయ్యకుండా ఈడ్చుకు రాగలదు. కాని ఎదుగుతున్న నలుగురు పిల్లలు! తెల్లవారి, పీకల మొయ్యా అన్నంపెట్టి పంపిస్తే మళ్ళీ ఏదీ అవకుండా కడుపులు మోకాళ్ళ దగ్గరకి వేళ్ళాడేసుకు తయారు! దీపావళమావాశకి చొక్కా కుట్టిస్తే సంక్రాంతి నాటికి చెడ పట్టదు, చేతులు ఎక్కువు!

ఎలా వీళ్ళతో! ఆ రోజు ఎలా గడపడమా అనేదే వీళ్ళతో సమస్యగాని, వీళ్లెప్పుడు పుట్టేరో ఎవడికి జ్ఞాపకం?

పక్కింటి గడియారం కొట్టిన రెండు గంటలు చెవిలో పడగానే గోపాలరత్నం ఆలోచనలు పక్కదారినుండి మళ్లీ అవసరమైన అసలైనదారిలో పడ్డాయి. అతని గుండెవేగం మరింత హెచ్చింది. అవును, ఆ పదహారో తారీఖు వాళ్ళ ఆఫీసరు ఆది నారాయణగారి పుట్టినరోజు! గుమాస్తాలనే కీలుబొమ్మలను ఆడించే ఆధారాలు

మరింత వెర్రివెధవల్ని చేసి నాటకమాడే నాయక శిఖామణుల్లో మొదటిస్థానం దేవుళ్ళది. రెండోది మనమే ఎన్నుకుని మనలో మనమే తన్నుకుని చచ్చేలా చేయగల నేర్పుగల పాలక వర్గానిది. మూడోది వివిధ కీలకస్థానాలలో ప్రభుత్వం చేతిలో పావుల్లా నియమింపబడి శక్తిహీనవర్గాలను శక్తికొలదీ దోచుకుతినే ఆఫీసరు మహాశయులది. మూడేళ్ళ క్రిందటే రిటైరు అయిపోతారనుకున్న ఆదినారాయణగారు ప్రత్యేక ప్రతిభాశాలిగా గుర్తింపబడి ఏటైఎనిమిదో పుట్టినరోజు యధావిధిగా జరుపుకుంటున్నారు. ఇంట్లో ఆ రోజు తిన్నా పడుకున్నా ఆఫీసులోని అందరు స్టాపు మెంబర్సూ తగు రీతిని ముడుపు సమర్పించుకుని వారి అనుగ్రహానికి పాత్రులవుతే తప్ప వారికి భవిష్యత్తు అంటూ ఉండదు. మనసు కలపినచోట ఎలాంటి ఒహుమతి యిచ్చినా, అసలు మనసంటూ ఉంటే. యివ్వకపోయినా పరవాలేదు. రాజకీయ ప్రాతిపదికతో, వ్యవహార జ్ఞానంతో, లౌకిక కుశలతతో ఇచ్చే బహుమతులకి విలువ ఉండక పోవచ్చు గని ధర అంటూ ఉంటుంది. పెట్టుబడి ఉంటేగాని వ్యాపారం జరగదు. రోజువిడిచి రోజు తప్ప పొయ్యిలో పిల్లి లేవని గుమాస్తాగాళ్ళకి నాలుగువేళ్ళూ నోట్లోకి వెళ్ళే అవకాశమే ఉండదు. ఇక పై అధికారికి బహుమతులు ఎలా?

విశాఖపట్నం వెళ్ళి తేల్చుకురావాలని గోపాలరత్నం పదేళ్లనుంచి ప్రయత్నిస్తున్నారు. వల్లగావున్నా, పొట్టిగావున్నా అడదంటే కాదనరు గనక, తిలకానికి ఎవడో ఒకడు మొగాడయితే చాలు. ఎంతో అంత ఇచ్చి కట్టబెట్టిదామని ఆమెతో ఇరవై వెళ్ళిన మరుక్షణంనుంచీ గోపాలరత్నం కలలు కంటున్నారు. మూడు చిరుగులూ, ఆరు మాసికలుగా వర్ధిల్లని బట్టలతో తన పిల్లలు నలుగుర్నీ—తను చచ్చే లోగా ఒక్కరోజంటే ఒక్కరోజయినా కళ్ళ చూడాలని గోపాలరత్నం ఏళ్ళతరబడి ఆశపడుతున్నారు. ఇవేవీ జరగలేదు సరిగదా — తన కళ్ళజోడు మార్పించడం జరగలేదు. తన సైకిలుకి కొత్తటైర్లు వేయించుకోడం కుదరలేదు. నిమషానికి పదిసార్లు కక్కే తన పెన్ను పాళీ మార్పించుకోడం సహా అవలేదు.

కాని .... యీ ఎనిమిదేళ్ళ సర్వీసులో ఓసారి ఈగిల్ ఫ్లాస్కూ, మరోసారి పైలట్ పెన్నూ, ఇంకోసారి దంతపు గుండీల పెట్టూ....ఇంకా ఏమేం ఇచ్చాడో సరిగ్గా జ్ఞాపకంలేదు గాని .... ఏటా ఈ ఆబ్దికాన్ని యధావిధిగా పెట్టలేక, పొత్తర్ల రూపంలో—పితృదేవతల పేరు చెప్పి భూ భూతాలచేతికి స్వయంపాకం నిమిత్తం ఇంతని దర్శించుకున్న పద్ధతిని .... కొందరు బుద్ధిమంతులైన స్టాపు మెంబర్స్ను కనిపెట్టారు. కొంత తర్జనభర్జనలు జరిగిన



మీదట జూన్ నెల జీతంలో రెండున్నర శాతం ప్రతివారూ శ్రీవారికి ఏకమొత్తంగా పోగుచేసి ఏదో ఓ వెండికంచమని గాని, స్టెయిన్‌లెస్ స్టీల్ కేరేజి అనిగాని, ఇలా ఏదో ఒక వస్తురూపేణా బహూకరించేలా నిర్ణయం తీసుకున్నారు. గత మూడేళ్ళ బట్టీ అదే అమలులోకి వస్తోంది .... ఆ రోజు సాయంత్రం అందరూ ఆ సీనియర్ ఆఫీసర్ శిఖామణిని దర్శించుకుంటారు.

....ఏదో భగవంతుడు మా కింత తిండికీ, గుడ్డకీ లోపంలేకుండా ఇచ్చాడు కాబట్టి, దానికి మూలకారకులయిన తమ లాంటి ప్రభువులు పదికాలాలపాటు చల్లగా ఉండాలని—తమ కిలాంటివి ఇష్టంలేదని తెలిసినా ... ఈ శుభదినాన మరో ఇన్ని శుభదినాలు తమరూ శ్రీరామచంద్రమూర్తి కటాక్షంవల్ల ఆయురారోగ్యాలతో తులతూగాలని కోరుతూ....కొండంత దేవుడికి కొండంత పత్రి ఇవ్వలేం గదా అని సరి పెట్టుకుంటూ....

సహజత్వానికి సరిహద్దు లుంటాయి గాని నటనకి నాన్చుడానికీ అవధులంటూ ఉండవుగదా! అందుకే ఆశ్రితుల వాక్యాలు పూర్తికావడం అంటూ ఉండదు. దానికి తగ్గట్టుగానే నటకుల చక్రవర్తులుంగారు అంటారు:

"మన రామ రాజ్యంలో అసంతృప్తి చోటు లేదని వేరే మీరందరూ రుజువు చెయ్యాలా, కళకళలాడుతున్న మీ ముఖ కమలాలు చూస్తే తెలియడం లేదూ! జిల్లాకంతటికీ పెద్దనయినా చేతిడబ్బుతో టిక్కెట్టు కొనుక్కుంటేగాని సినిమా హాల్లో కూచోను. పెర్మిట్స్ అనీ, టెండర్స్ అనీ, కంట్రాక్ట్స్ అనీ, రికమెం

డెషన్సు అవి అటు వాచిముల్లు ఇటు తిరిగే లోగా ఏరోప్లేను ఎరపెడతామన్నా ఎర్ర ఏగాణీ పుర్రచేత్తో ముట్టుకుని ఎరగను. ఏడువారాల నగలకి ఇసుమంత లొంగని కృష్ణమూర్తినహా తులసీ దళానికి తూగి ఊరుకున్నాడు. అష్ట అయిశ్వర్యాలనీ కాదనగలంగాని అభిమానానికీ భక్తికీ అవుననక తప్పదు. ఇంత మంది ప్రేమానురాగాన్ని గాయపరచే కఠిన హృదయం నాకు లేదు....ఏం చేస్తాం! ఎంత ఆలోచించినా మిమ్మల్ని నొప్పించడం నావల్లకావడం లేదు....మనసెంత చెబుతున్నా నా చేతులు ముందుకు రావడం లేదు....మీరేం తెచ్చారో మీ చేతుల్తో మీరే ఆ టేబిల్‌మీద పెట్టి వెళ్ళండి....''

అదీ అలాగే అంతూ పొంతూ లేకుండా సాగుతుంది. అతినారాయణ గారు అరుగు మీద నిలబడతారు. అసలు అంత మంది కూర్చోడానికి అక్కడో చాప అయినా వేసి ఉండదు. ఇంటి ముందు ఖాళీజాగాలో మట్టిలో చేతులు కట్టుకు నిలబడి, ఏ పి. యే. గారో మాట్లాడుతూ ఉండగా అందరూ ''రెండు నిమిషాల పాటు మౌనంగా ప్రార్థిస్తారు.' ఏదో ఉడతా భక్తిగా, వారు తెచ్చిన నాలుగొందల ఖరీదుకు తక్కువగాని ''చంద్రుడికో నూలు పోగు'' ని అక్కడ ఉంచుతారు. ఆఫీసరు గారు వచ్చిన వాళ్ళకి మంచినీళ్ళయినా ఇవ్వరు. అలా ఇవ్వలేదని ఏ ఒక్కరూ పైకి అనుకోరు ఒకవేళ పొరపాటున ఇంటి దగ్గిర అలా అన్నా 'యాచక పితామహులని' పేరు గాంచిన వారి పెద్దలు వాళ్ళవాళ్ళ నోళ్ల నొక్కుతారు. అందుకని అక్కణ్ణుంచే అందరూ శలవు తీసుకుంటారు. ఇంత జరిగినా అక్షర ముక్క అఫీషియల్‌గా రికార్డు కాకుండా చూసుకోడంలో ఆఫీసరు కంటె అసిస్టెంట్లు పడ్డ తాపత్రయమూ, శ్రమా ఎక్కువ!

మంచి వార్త తెచ్చిన టెలిగ్రాము బంట్రోతు చేతిలో పెట్టించి బక్షీసు అంటాము. మనల్ని ఎప్పుడయినా ఓ కంట చూడకపోతాడా అనే ఆశతో ఆఫీసరుకిచ్చింది బహుమతి అంటున్నాము. పోస్టలు ప్యూన్‌కి, డిస్ట్రిక్ట్ ఆఫీసరుకీ వారివారి విధుల్ని సక్రమంగా నిర్వర్తించడానికి ప్రభుత్వం నెలజీతాలు ఏర్పాటుచేసింది. జీతాల మొత్తంలో తేడా తప్పితే ఈ ఇద్దరు గవర్నమెంటు సర్వెంట్సుకీ మనం ముట్టచెప్పే కానుకలకి వేరు వేరు పేర్లుకూడా ఎందుకు? శలవు పెట్టుకుని ఆ జూన్ పదహారున యింట్లో కూచున్న గోపాలరత్నానికి తనకి తనే యెంతో ద్రోహం చేసుకుంటున్నాననే భావం నిలువెల్లా క్రుంగదీయసాగింది. ఎక్కడెక్కడి ఊహలూ అతని దిగుల్ని మరింత ద్విగుణీకృతం చేశాయి.

కాలేజీలో చేరడానికి సీట్లు అమ్ముతున్నారు. పరీక్షలు ప్యాసవడానికి మార్కులు అమ్ముతున్నారు. డిగ్రీలు వచ్చేక ఉద్యోగాలు అమ్ముతున్నారు.

ఉద్యోగాలు దొరికేక ప్రమోషన్లు అమ్ముతున్నారు. అంతా ప్రతి ఒక్కరికీ తెలిసిన వ్యవహారం. బేరం లాభనష్టాలు. అంతే. కొనగలవాడే మేల్కొనగలవాడుగా చెలామణీ అవుతున్నాడు. లేనివాడు బతకలేనివాడుగానే మిగిలిపోతున్నాడు. పేర్లు తేడా గాని దోపిడీవిధానం లేని చోటులేదు. పత్రికాధిపతులు పాఠకుల "కాలక్షేప సూత్రాన్ని" ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారు. సినీ నిర్మాతలు ప్రేక్షకుల నీచాభిరుచుల్ని రెప్పగొట్టి కొల్లగొడుతున్నారు. మంత్రులు ప్రజల అజ్ఞానంమీద పడి బతుకుతున్నారు. ఎక్కువతక్కువల్లో ఎవరు చేసినా వ్యాపారం వ్యాపారమే. వ్యభిచారం వ్యభిచారమే!

తన చింకిబట్టలూ, అవయవలోపాలూ చూపించి మీ ఇంటికి వచ్చి చెయ్యిజాపి అడిగిన ముష్టివాడికి మీరిచ్చిన అయిదు పైసల నాణేన్ని ధర్మం అంటున్నారు. తన ఆస్తిపాస్తులూ, తెచ్చుకున్న డిగ్రీలూ చూపించి, మీ యింటికి మధ్యవర్తి పంపి అడిగించిన వరుడికి మీరిచ్చిన అయిదువేల రొక్కాన్ని కట్నం అని పిలుస్తున్నారు. తేడా ఉండటానికి ఉంచని పేరు అన్నింటి పద్దులో కాలేసినట్టే. లేనివాడికి మొండిచెయ్యి చూపుతున్నారు. దోపిడీదారుకి పచ్చజెండా ఊపుతున్నారు. ఇంతటి సాంఘిక దురన్యాయంలో మీరుకూడా ముఖ్యమైన భాగస్వాములు కారా?

గోపాలరత్నం మనసుని అంతలా నిలదియ్యడానికి అంతకు ముందురోజు జరిగిన ముఖ్యమైన సంఘటనే కారణం. తన ఇంటి కిటికీతలుపు తీసి చూస్తే దూరంగా రెండురోడ్ల అవతల, చింతచెట్టు నీడన, గోనెపట్టామీద వేరుసెనక్కాయలు పోగులుపెట్టి అమ్ముకునే తాత కనిపించేవాడు. అతను మరి కనిపించడు. ముందురోజు రాత్రే చచ్చిపోయాట్ట. అతని కెవరూ లేరు. అక్కడ మేడమీది మెస్‌లో చదువుకుంటున్న కుర్రాళ్ళే అతని దహన సంస్కారం నిర్వహించారు. ఇంటింటికీ వచ్చి చందాలు పోగుచేశారు. గోపాలరత్నం ఏమీ ఇవ్వలేకపోయాడు. అది నారాయణగారికని వేరే ఉంచిన సొమ్ము. అలా ఉంచడానికే తనకి చాలా కష్టమైపోయింది. అదీ అలా హెడ్ గుమాస్తా చేతిలో అలా పెట్టి పంపేసిన అరగంటకి ఇలా యీ కుర్రాళ్లు వచ్చారు. వాళ్ళని ఉత్తిచేతులతోనే పంపవలసి వచ్చింది. నా అన్నవాడు లేని ఒక దరిద్రుడికి చచ్చిన రోజుకి తన చేత్తో తనో రూపాయి చందా ఇవ్వలేకపోయాడు. వేలకి పైగా నెలజీతం గల ఒక భాగ్యశాలి పుట్టినరోజుకి తన చందా ముందుగానే కట్టేశాడు. చేతకానితనంతో, పిరికివాడి కోపంతో "ఏమైతే అవనీ ... ఇంకోటి ఉద్యోగం పోయి నాలుగువీధులు అడుక్కు తిననీ.... ఇవాళ మాత్రం నేను ఆదినారాయణగారి బర్తుడేకు మాత్రం వెళ్ళనుగాక వెళ్ళను" అని తీర్మానించుకున్నాడు.

ఆ బక్కపేగుల మనిషికి ఆ మాత్రం

శాంతి అయినా కలక్కుండా మరో ప్రశ్న అతవిలోంచే అతన్ని విలదీసింది. "ఆఫీసరుగారి జన్మదినాన గైరుహాజరు కాగల ధైర్యమే ఉంటే అ పనేదో సాహసంతో చేసెయ్యక జ్వరంగా ఉందని లీవుపెట్టి తప్పదాటు వెయ్యడమెందుకు గోపాలరత్నం?"

దానికి జవాబు చెప్పుకోలేని తికమకలో ఉండగానే "అన్నయ్యా, కాఫీ" అంటూ తిలకం తనని యీ ప్రపంచం లోకి తెచ్చింది. ఆ కాఫీగ్లాసు ఇలా అందుకున్నాడో లేదో తోటి గుమస్తా విశ్వం వచ్చాడు. తను మంచంమీద కూచుని స్టూలు దల్ల అతనికి వేసి, హేండిల్ విరిగి పోయిన కప్పులో కాఫీ సగానికి పోసి అతని చేతికిచ్చేడు.

"ఇంకా మూడయినా కొట్టినట్టులేదు. ఇవాళ అప్పుడే బయల్దేరుతున్నారా ఏమిటి? నా వంట్లో ఏం బాగులేదోయ్....మరోలా అనుకోవద్దని ఏదో సందర్భంలో నారాయణగారికి నా క్షమాపణ చెప్పెయ్య' అన్నాడు గోపాలరత్నం కాఫీ తాగినంత గబగబా. విశ్వం అందుకున్నాడు:

"అయ్యో రామా, ఏ లోకంలో విహరిస్తున్నావు రత్నం నువ్వు? ఈ ఏడాది అలాంటివేం పుచ్చుకోనని 'రావణాబ్రహ్మ' గారు ఎప్పుడో చెప్పేశారే!"

ఆఫీసరుగార్ని గోపాలరత్నం ఒక్కడే పేరుతో వ్యవహరించేది.

"అదేమిటి? విన్నటికి విన్న మన ఏడుకొండలు నా వాటా వసూలుచేసుకు వెళ్లేడే!"

విశ్వం పకపక నవ్వి అన్నాడు:

"బాగుంది బాగుంది. నీకూ వేళాదూ? హైపిస్టు దామోదరం దగ్గరకూడా ఇలాగే పుచ్చుకున్నాట్ట....దేవుణ్ణి మించిన 'కేపిటలిస్టు' లేనప్పుడు పూజారిని మించి దోచుకు తినేవా రెవరుంటారు! అప్పుకింద జమ కట్టుకోండి. రుణాన్ని పడివుండి ఏ వచ్చే జన్మలోనో తీర్చుకోక పోడు. దుఃఖ పడకండి. సరే. ఇంతకీ నీ ఒంట్లో ఎలా ఉంది?"

"ఇప్పుడు జ్వరం పూర్తిగా తగ్గి పోయిందిలే. దానికేంగాని నారాయణగారు ఉన్నట్టుండి పుట్టిన రోజు కానుకల్ని ఎందుకు రద్దుచేసినట్టూ? పైకి ఏవైనా కాయితం వెళ్ళిందా యేం?"

"పైకి కాగితం పెట్టుకున్న సుబ్బారాయుణ్ణి పైకి పంపించే ప్రయత్నం మాత్రం ఆ మధ్య దిగ్విజయంగా నిర్వహించబడిందిగా! మనిషి రక్తం మరిగిన పులికంటె క్రూరమయింది రూపాయి రుచి. దాన్ని అడ్డుకోడానికి ఎన్ని శక్తులుండాలి!"

ఆమాట కెందుకో గజగజ వణికి పోయాడు గోపాలరత్నం. ఎలాగో విలదీసుకుని నీరసంగా మరో ప్రశ్న అడిగేడు.

"అయితే? ఈ ఏడాది చివరికి ఎలాగా రిటైరు అయిపోతాడనా?"

"రిటైరు అవకూడదనే అనుకుం

దేవుడు కల్లో కనిపించి "భక్తా! నీవుటు ఫలానా నా భక్తునికే వేయుము" అని ఉపదేశించాడు! అయినా నేను వేయలేదు- ఉన్నవాళ్లల్లా కొస్త మంచివాడిని చూసి అతనికే వేశా!



యాము. అటు అధికారుల్ని కాకా పట్టడంతోపాటు ఇటు అనుయాయుల్ని కూడా అన్నివిధాలా మంచి చేసుకుంటే షష్టి పూర్తిదాకా దేకవచ్చును గదా! ఏమో దైవలీలలు ఎవరికెరుక! నిజమో అబద్ధమో గాని నే నింకో మాట విన్నాను."

"ఏమిటది?"

"ఏం లేదు. ఈసారి ఎలక్షన్లలో మన శివకసామ్రాట్ తోడల్లుడుకూడా తొడ కొడుతున్నాడని ఒక పుకారు. మన స్టాఫు అందరి ఓట్లూ వాడికే వేయిద్దామనే ఎత్తుకి ఇది తొలిమెట్టు కావొచ్చు. అంచేత, బ్రదర్, మనం ఇప్పుడు ఇచ్చే స్థితిలో లేం. పుచ్చుకునే స్థితిలో ఉన్నాం. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టడం మంచిది. వస్తా...."

విశ్వం వెళ్ళిపోయాడు. అల్లాడిపోతున్న గోపాలరత్నం అంతరంగాన్ని మరింత అట్టడుగున, అయోమయస్థితిలో పడేసి మరీ వెళ్ళిపోయాడు. ఎంత కాదనుకున్నా ఆదినారాయణగారు తనకి ఉద్యోగం ఇచ్చిన ఆఫీసరు. తనకి నెలజీతం ఇప్పించగల అధికారి. 'ఇరుగు పొరుగిండ్లకైనను....' అనే పద్యంలో కుమారీ శతక కర్త శలవిచ్చినట్టు కులకాంతకి కడుపుట్టినా సరే 'వరుడో కా కత్తగారో వదినయొ బావో....' ఆఖరికి ఉయ్యాలలో ఊగుతున్న ఎనిమిది నెలల మరిది పెద్దవయినా సరే ఎవరో ఒకరి పెర్మిషన్ తీసుకోనిదే గుమ్మం దిగడానికి విల్లేదుట! ఇంచుమించు అలాంటి సంప్రదాయం అనుసరిస్తున్నవాడే గోపాలరత్నం కూడాను. అప్పుడప్పుడు మనసు విప్లవ శంఖం పూరించి ఓ ఊపు ఊపి వదిలి

పెడుతున్నా. యజమాని అన్నవాడికి అపచారం తలపెట్టడానికి అతని మనసు అంగీకరించడం లేదు. మంచో చెడ్డో వెళ్లేది వెళ్లనియ్యకుండా యజమాని ప్లేటు ఫిరాయించాడనే వార్త గోపాలరత్నం మృదువైన మనస్సుని మరింతగా కలచి పారేసింది.

సరిగ్గా ఆ సమయానికి ఆ యింటి ముందు కారాగింది.

అతడు తన కళ్ళను తనే నమ్మలేక పోయాడు.

కారు దిగి తన యింట్లోకి వస్తున్నది ఆదినారాయణగారు!

"ద....ద....దయచేయండి" అంటూ నమస్కరించడంకూడా మరచిపోయి ఆహ్వానిస్తూ ఖరీదైన ఉలెన్ సూట్‌లో ఉన్న ఆ మనిషిని ఎక్కడ కూర్చోపెట్టడమో తెలియక కిందా మీదా అయిపోతాడు గోపాలరత్నం.

ఆ యింటి పరిస్థితిని ఎగాదిగా చూస్తూ, తనే దగ్గరున్న స్టూలు లాక్కుని కూర్చున్నారు ఆదినారాయణగారు

"ఏంవోయి గోపాలం....నీకు జ్వరంగా ఉందని ఏపి ఓసారి చూసిపోదామని వచ్చానంతే. నువ్వా పక్కమీంచి లేచేసంతే యిప్పుడే వెళిపోతాను ..ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను ఇలా బయల్దేరదామని. దిక్కుమాలిన ఆఫీసు పనులు తెమిలి చావవు కద....ఎప్పుడూ చెప్పేవేకాదు, ఇంత రెచెడ్ క్వార్టర్స్‌లో ఎలా ఉంటున్నావోయ్ నువ్వు? మనకేం .... ఎలాగోలా పెద్దవాళ్ళం అయిపోయాం .... ఇలాంటి వాతావరణంలో పెరిగితే మన పిల్లలు ఏం కావాలి? చూడూ నీకు ఫిలిప్పు డీలరు సుందరం తెలుసు గదూ....చాలా కంఫర్టబుల్ క్వార్టర్సు కట్టించాడు యీ మధ్య... మళ్ళీ అద్దెకూడా యెంతో యెక్కువ ఉండదు. ఓ హండ్రెడ్ రుపీస్ ఎడ్వాన్సు మాత్రం ఇవ్వాలి....అన్నట్టు యిప్పట్లో నువ్వు ఇవ్వలేవేమో! ఓ, వాటెఫూల్ అయాం! నేనే ఇస్తాను .... ఇంటికెళ్లేటప్పుడు అతన్తో ఓ ముక్క స్వయంగా చెప్పేసి మరీ వెడతాను...నువ్వు కాదంటే నే నొప్పుకునేది లేదు. జీతంలో నెలకింతని కట్టుకుందువు గానిలే....ఇంకా అందులో ఒకటి ఖాళీగా ఉండడం మన అదృష్టం."

గోపాలరత్నం కళ్ళమ్మట గిర్రున నీళ్ళు తిరిగేయి. ఈ సహృదయుడినేనా తన మనసు గంటలతరబడి శంకిస్తున్నది!

ఇందాకటినుంచి ఒక్క అక్షరం పొల్లుపోకుండా యీ మాటలన్నీ వింటున్న అమ్మమ్మ ఇంక బయటపడకుండా ఉండలేకపోయింది. గోడని ఆసరాగా పట్టుకుని అక్కడికొచ్చి ఆదినారాయణగారి సమీపంలో కూలబడింది

"పెద్ద ముండని. కళ్లు సరిగ్గా ఆని చావవు. ఆయాసం. చతికిలపడ్డానని మరోలా అనుకోకండి బాబుగారూ! మీ దగ్గిర పనిచేస్తున్న మా గోపీ బొత్తిగా

నోట్లో నాలికలేని సత్తెకాలపు సన్నాసి. వీడి చెల్లెలికి రెండేళ్ళున్నప్పుడు మా అమ్మాయి వీళ్ళిద్దర్నీ నా కంఠానికి చుట్టబెట్టి కళ్లు మూసింది. ఇంతున్నప్పుడు వీడి లోకజ్ఞానమెంతో ఇప్పుడూ అంతే. ఎన్నోసార్లు చెప్పేను. మీ దర్శనం చేసుకుని మంచీ చెడ్డా చెప్పుకోరా అని. వింటేనా? దేవుడు పంపినట్టు యివాళ మీరే దిగివచ్చేరు. ఇంట్లో మనిషిలా మాట్లాడుతున్నారు. మీ దగ్గిర వాడికింత భయమెందుకు చెప్పండి? ఒకర్ని అనుకోడ మెందుకు. నా చేతులు మంచివి కావు. నేను చేసిందేదీ నిలబడదు. లేకపోతే ఎందుకూ పనికిరాని నేనిలా బతికుంటట మేమిటి. మహాలక్ష్మిలాంటి యీ యింటి కోడలు నా ముందే మసైపోవడ మేమిటి. కర్మ బాబుగారూ, అంతే.... ఇదిగోండి గుండెలమీద కుంపటిలా పెళ్ళికాని మా తిలకం ఒంటరిదే. ఒసే, ఏం చేస్తున్నావే, వచ్చి బాబుగారికి దండంపెట్టూ."

తిలకం వచ్చి నమస్కారం చేసి, మామ్మగారి మంచం పక్కకు నిలబడింది.

"భలేవాడివేనోయ్ గోపాలం! ఇలాంటి చిక్కులున్నాయని మాటవరసకయినా నాతో చెప్పావా? నీకు పెళ్ళికెదిగిన చెల్లెలొకత్తి ఉందని చూచాయగానైనా నేను ఎరగను సుమా! మామ్మగారూ, మనది ఏ శాఖ అన్నారూ?"

అమ్మమ్మ చెప్పింది

"ఇంకేం? నాకు తెలిసిన సంబంధం ఒకటి రెడీగా ఉంది. అబ్బాయి కిమాత్రం ముప్పైఒకటో రెండో ఉంటాయి. మీకు అభ్యంతరం లేకపోతే...."

తిలకం ఇంక అక్కడ ఉండలేకపోయింది. పెరట్లోకి పరిగెత్తింది కూని రాగం తీస్తూ .... ఓ అయిదునిమషాల తర్వాత ఆమె వచ్చేక వినపడ్డ మాటలివి.

"చూడండి మామ్మగారూ. మీ వయసెంతన్నారు?" ఆ మాటకి అమ్మమ్మ సిగ్గులేక మెలికలు తిరిగిపోయింది.

"సరిగ్గా తెలీదు బాబుగారూ. అరవై వెళ్ళేయేమో...."

"ఓస్, ఇంకా ఎంతో అనుకున్నాను! దబ్భైఅయిదేళ్ళ మా అవ్వకి ఆపరేషను చేయించి కళ్ళజోడు పెడితే ఇట్టే వచ్చింది ఒకటోరకమైన చూపు. ఆ ఆపరేషను చేయించిన డాక్టరు ఇంకా యీ ఊళ్లోనే ఉన్నాడు కూడాను. ఇంటికెళ్ళగానే ఫోన్ చేస్తాను రేపీపాటికి మీ యింటికి వచ్చి మీ కళ్ళు పరీక్ష పూర్తిచెయ్యగలడు!"

గుడ్డికళ్ళలోంచి వేడినీటి కన్నీటి చుక్కలు కురిపిస్తూ ముందుకి జరుగుతూ అంది ఆవిడ!

"బాబుగారూ, మీ పాదాలు ఒక్కసారి నా చేతుల్తో తడప నియ్యండి" ఆ నారాయణ గారు చటుక్కున బూటు కాళ్లు తీసేసుకుని లేచి రెండడుగులు వెనక్కి వేశారు.

"ఎంతమాట ఎలాంటిమాట అన్నారు మామ్మగారూ! మా అమ్మలాంటి వారు!"

"దిక్కుమాలిన దాన్ని. నాకూ దేవతా మూర్తి లాంటి మీ తల్లిగారికీ పోలిక ఏమిటి బాబూ! కాళ్లు కాకపోతే పోయే తల అయినా తడమవీ" ఆయన విలబడ్డ ఆవిడ దగ్గర వెంటనే వంగి ఆ అవకాశం యిచ్చాడు.

"ఏ చల్లని తల్లి ఏ చల్లని వేళ కన్నదో....వెయ్యేళ్ళు వర్ధిల్లు నాయనా!"

గద్గదిక కంఠంతో ఆయన అన్నారు: "చూశావా, చూశావా గోపాలం! వద్దు వద్దన్నా వినక మీరందరూ కలిసి ఏటేటా ఈ రోజున నా కేమిటేమిటో తెచ్చి యిచ్చే వారు....అనుభవంతో పండిపోయిన యీ తల్లి దీవనకన్న ఎందరెందరు కలిసినా నాకేం ఇవ్వగలరు! నే నందుకే వచ్చాను, వెరుతున్నాను. గోపాలం, గుర్తుంది కదూ ఇవాళ జూన్ పదహారు!"

కలలో నయినా ఎదురుచూడని కరుణతో సానుభూతితో మునిగి తేలుతున్న గోపాలం మనసు ఉక్కిరి బిక్కిరి చిక్కబెట్టుకుని మరొక్కసారి పిలదొక్కుకుని లేచింది. అవును, ఆరోజు ఆదినారాయణ గారి పుట్టినరోజు. బిక్కు మృగాల రక్తం చుక్క చుక్కా తీసి భద్రకాళికి ఏటేటా బలిపెడుతున్నరోజు. గంధకద్రవ సింధువులో సుందర మధు బిందువులా! విశ్వం ప్రతిమాటా తూటాలా తన చెవిలో రొద పెడుతోంది. అందర్నీ అన్ని విధాలా మంచి చేసుకుంటే షష్ఠి పూర్తిదాకాదేక వచ్చు. లేదా అందరి ఓటూ తన తోడల్లుడికే వేయించే ప్రయత్నం కావొచ్చు. లేదా మరేదైనా, అదేదైనా కావొచ్చు లేకపోతే ఇన్నేళ్ళ ఇన్నాళ్ళ తన చిమ్మ చీకటి బతుకులో ఒక్కసారి, ఒక్కసారైనా....

"ఏమిటోయ్, ఉన్నట్టుండి అలా పెట్టావ్ మొహం!"

"ఏం....ఏం....ఏం లేదండి....క్ష....క్షమించండి."

"దేనికోయ్ నిన్ను క్షమించడం! ఇన్నాళ్ళూ నీ కష్టాలు నాతో చెప్పుకో లేదనేనా! ఫరవా లేదోయ్....తప్పులు మనుషులు కాకపోతే దేవుళ్లు చేస్తారా! ఇప్పటికైనా సాటి మానవుడిగా ఆదుకొనే అవకాశం కల్పించావు, అదెంతకాదు! సరే నే వచ్చి చాలాసేపయింది. అసలు, పుచ్చుకోడంలోనే కాక ఇవ్వడంలో కూడా నాకు చాలాకాలం పట్టింది. ఇక నే వెడతాను....చూస్తూవుండు రేపటిరోజు నీకెన్ని శుభాలు జరుగుతాయో....అయ్యో నా మతిమరుపు మన్నుగాను. నీకు నలుగురు పిల్లలుండాలి కాదుటోయ్. ఏరీ, ఏరీవాళ్లు, ఎక్కడా సందడి వినపడదే!"

ఇంకో నిమిషం కూచుంటే వాళ్లు బడి నుంచి వస్తారనీ చూసి మరీ వెళ్ళమనీ అమ్మమ్మ చెప్పినమీదట విలబడ్డ ఆదినారాయణ గారు మళ్ళీ కూచున్నారు.

అవునవును, నాకు నలుగురు పిల్లలుండాలి కదూ!....అనుకుని తనలో తనే నవ్వుకున్నాడు గోపాలరత్నం....అతని



శ్రీమతి అతనికోసారి పిల్లల్ని గురించి చెప్పిన సంగతులు తల్లి గుండె కీర్తవలో ప్రతిధ్వనించే సంగతులు. —ఏమండీ. ఎన్నిమాట్లు చెప్పినా అపరేషను చేయించు అనే నా సాధింపు ఈమధ్య మరీ ఎక్కువై పోయింది కదూ! ఏం చెయ్యమన్నారు. వాళ్ళకేం కావాలో కడుపునిండా పెట్టలేని దురదృష్ట జాతకురాల్ని .... నా మనసు మనసులో ఉండక ఏవేదో అనేస్తూంటాను —ఏమీ అనుకోరు కదూ?

—ఇదిగో వింటున్నారు కదూ! ఒక్కొక్కప్పుడు నాకేమనిపిస్తూ ఉంటుందో తెలుసా? అయిదుగురు పిల్లలూ ఆదమరచి నిద్రపోయే వేళ ఎందుకో ఉలిక్కిపడి లేచి కూచుంటూంటాను. అలా అందర్నీ ఒక్కమారు చూసుకుంటూ ఉంటే—కన్నీళ్ళలోంచి కొసంత గర్వం కూడా ఉండుండి తొంగిచూస్తూ ఉంటుంది సుమండీ! అయిదుగురు పిల్లల తల్లిని నాకేం? అనుకుంటాను. అప్పుడు ఏమీ లేనట్టే తోచదు. గుండె అంతా నిండిపోయినట్టు కూడా ఉంటుంది. ఖర్మం కాలక దేశం దరిద్రంగా తయారయింది కనక ఇప్పుడిలా అఘోరిస్తున్నాం గాని పిల్లలులేని యిల్లు అదొక ఇల్లటండీ, వల్లకాడు గాని!

—ఏమండోయ్.... ఇంకో మాట.... నన్ను పెళ్ళాడక ఇంకే ధనవంతురాల్నో పెళ్ళాడి ఉంటే ఇంత కంటె మీ స్థితి బాగుండునని మీరోసారి అయినా అనుకుని ఉంటారు. అవునా? అలాగే నేనూ ఇంతకంటె పెద్ద ఉద్యోగస్థుణ్ణి కట్టుకుని ఉంటే యింత దౌర్భాగ్య స్థితి పట్టక పోయి ఉండునేమో అని ఎన్నోసార్లు

అనుకున్నమాట కూడా నిజం. కాని మనిద్దరం ఎప్పుడయినా ''ఈపిల్లలుకాక మరెవరైనా మన కడుపున పుట్టి ఉంటే బాగుణ్ణేమో।'' అనుకున్నామా। మనమే కాదు కుంటీ గుడ్డీ అయిన పిల్లల్ని గన్న తల్లితండ్రులు సహా అనుకోరు....అలాంటిది మన పిల్లలకేమండీ బంగారు కొండలు, రత్నాల రాసులు, వజ్రాల మూటలు।

''మామ్మగారూ। మీ మనవడు చూస్తే ఈలోకంలో ఉన్నట్టు లేడు। ఇక యీయన గారి పిల్లలూ యిప్పట్లో వచ్చేలా లేరు.... నేనింక వెడతాను.''

ఆదినారాయణ గారు లేచి వెళ్ళేలోగా అల్లంత దూరంనుంచే ఇల్లు పీకి పందిరివేస్తూ నలుగురు పిల్లలూ రానే వచ్చేరు. ఇంట్లో ఓ పెద్దమనిషి వచ్చి కూచున్నాడనే స్పృహే వాళ్ళకు ఉన్నట్టు లేదు.

''అమ్మమ్మ గారండోయ్ ఒవేవ్। నేనెక్కడున్నానో చెప్పుకో.''

''అత్తా, అత్తా, యివాళ మాకు టీచరూ చిలుకా కథ చెప్పేరు. నీకు చెప్పనా? అమ్మా, ఎంతాళ। మొన్న నేను నాలుగో ఎక్కం అప చెప్పించుకోమంటే తీరుబడి లేదన్నావ్।'

''నాన్నా యివాళ మా తెలుగు మేష్టారు పడుకున్నప్పుడు పిలక ఎంత పొడు గుంటుందో మేం స్కేలుతో కొలిచి చూశాం తెలుసా?''

''మా ఫ్రెండు శంకరంగాడు లేడూ, వాళ్ళ నాన్నని విన్ననే ఆసుపత్రి నుంచి తీసు కొచ్చేరట. వాడు చెప్పేడు, మరి వాడికి తమ్ముళ్ళు పుట్టకుండా వాళ్ళ నాన్న ఆపరేషన్ చేయించు కున్నాట్ట. పిల్లలు వాళ్ళ అమ్మకి కదా పుట్టేది, వాళ్ళ నాన్న ఆపరేషను చేయించుకోవడమేమిటి చెప్పూ? నవ్వలేక చచ్చామనుకో।'

''ఏయ్ పిల్లలూ మీరు నోరు మూస్తారా ముయ్యరా। ఒసే తిలకం వీళ్ళని లోపలికి తీసికెళ్ళి ఏదైనా పెట్టమ్మా। చూస్తే ఇంతున్నారో లేదో, ఎక్కడలేని పెద్ద కబుర్లూ వీళ్ళకే।''

అమ్మమ్మ చెప్పినట్టు తిలకం వాళ్ళని బలవంతాన లోపలికి లాక్కెళ్ళే తప్ప ముసిలాయనకి ఊపిరి తిరగలేదు.

''చూశారా బాబుగారూ, పిల్లలు ఎలా తయారయారో।'' అంది అమ్మమ్మ.

''దానికేంగాని, మీ పిల్లలు మాంచి దరుకైనవాళ్ళోయ్ గోపాలం'' అంటూ ఆయన ఇంకా ఏదో అంటూనే ఉన్నారు. పిల్లలు నలుగురూ వచ్చి ఊరుమీదకి బహాదూరు బయల్దేరు వాళ్ళని పలకరించకుండా ఆయన ఆ యింటినుంచి కదల్లేకపోయాడు

''కారెక్కిస్తాను, వస్తావటోయి అబ్బాయ్.''

'ఒక్ళ్లు నడుపుతుంటే ఎక్కాని కూర్చోడానికి నాకేం ఖర్మం। నా కర్ర గుఱ్ఱం ఉండగా।''

''నీ అంత రబ్బరుబొమ్మ కొనిపెడతాను. నాతో వస్తావుటే పాపా!''

''నా అంత బొమ్మ నేనేం చేసుకోనూ!''

''మా యింటి కొస్తారా. బిళ్ళలూ, బిస్కట్లూ కొనిపెడతాను!''

''మే మెందుకు రావాలి. కావాలంటే మీరే తెండి. అప్పుడు ఆలోచిస్తాం.''

''మాటకి మాటా బాగా చెబుతున్నారే! మిమ్మల్ని నలుగుర్నీ కలిపి ఎత్తుకుపోతా. ఏం చేస్తారేం?''

''మేం మీకు దొరికితే గదా! అయినా మీలా మాకేం పనీపాటూ లేదనుకున్నారా యేం? అల్లవాళ్ళింట్లో పిల్లి మందార విడిచిందిట. వెంటనే వెళ్ళి చూసిరావాలా వద్దా! మా చాకలాడి గాడిదకి ఇంత ముండ పుట్టిందిట. ఎంతో ముద్దొస్తోందిట. చూసి రావొద్దా .... తప్పుకోండి తప్పుకోండి. పెద్దబజారుల్లో పావలా యిస్తే ఏనుగుపిల్లని ఎక్కనిస్తున్నారట....పక్క మేడమీద...'' గుక్క తిప్పుకోకుండా వెంటనే హాజరు కావలసిన అర్జెంట్ పనుల అంతులేని లిస్టు. అలా చెబుతూనే పిల్లలు నలుగురూ తుర్రుమన్నారు. మరో గదిక ఆదినారాయణగారొచ్చాడ వెళ్ళి పోయారు .... అమ్మమ్మ పంచాంగం విప్పింది.

''ఇంటికా పెద్దమనిషి వస్తే నీ పిల్లలు చేసిన మర్యాద చూశావట్రా గోపీ?''

....నా ఉద్యోగం యీ మాత్రంగానైనా నిలబడాలని తెలిసినా ఏటా వార్షికాలు చెల్లించాను. ఆ మనిషి హృదయం లేనివాడని తెలిసికూడా అన్నీ సిగ్గులేక విస్మరించి అతన్నే ఆశ్రయించాం దేవికీ నాకో యిల్లు కావాలి. నీకు చూపు రావాలి. చెల్లెలికి మొగుడు దొరకాలి ఇవన్నీ బజార్లో అమ్ముతున్నారు కనుక, ఆయన కొనిపెడతానన్నాడు. కాని ఆయన కొనలేనిదికూడా ఒకటుందని తెలిసి నా మనసు పరవశిస్తోంది. దిక్కుమాలిన పరిస్థితుల్లో పుట్టినా, పెరుగుతున్నా యిప్పటికి నా పిల్లలకి వ్యాపారలక్షణాలు వంటబట్టలేదు. ఈ జీవితం వాళ్ళకొక క్రీడారంగం.... ఎప్పుడూ ఇలాగే ఉండిపోతే!....ఉండదని తెలిసినా ఆ క్షణంలో ఆ పిల్లల్ని ప్రసాదించిన తల్లిని తృప్తితో తలుచుకోకుండా ఉండలేకపోయాడు గోపాలరత్నం.